క్లుప్తంగా

పేదలకు వస్త్రాల పంపిణీ



పేదలకు వస్త్రాలను అందజేస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు

బలిజిపేట: పెదపెంకి పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు పి.ఎండయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు, కుటుంబీకులు ఎస్సీ వీధిలో 130మంది పేదలకు వస్త్రాలు శనివారం పంపిణీ చేశారు. ఎండయ్య కుమారులు పి.ప్రసాద్ రాజు, నారాయణరావు, ఆనంద్, కుటుంబీకులు నిరుపేదలకు వాటిని గ్రామ పెద్దలు అప్పలనాయుడు మాస్టారు, ఇ.సంజీవినాయుడు, జి.సంజీవినాయుడు చేతుల మీదుగా వీటిని పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ నిరుపేదలకు అన్నదానం, వస్త్రదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పెద్దలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



గాంధీ సెంటరు వద్ద నివాళులర్పిస్తున్న యువకులు, పెద్దలు

బలిజిపేట: అహమ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి పెదపెంకి యువత నివాళులర్పించారు. నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మృతుల కుటుంబాల వారు మరవలేని విషాద ఘటన ఇది అని పలువురు పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో యువత, పెద్దలు పాల్గొన్నారు.

రహదారే మురుగు కాలువ



రోడ్డుపై పారుతున్న మురుగు

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం గ్రామంలో నిత్యం రైతులు పాలు పోసే పాల ఉత్పత్తి కేంద్రం వద్ద కాలువ ద్వారా వెళ్లాల్సిన మురుగునీరు రోడ్డు మధ్యలో పారుతోంది. అలాగే కాలువ నిర్మాణం పూర్తి కాకపోవడంతో మురుగునీరు అంతా పక్కనే ఉన్న మంచినీటి బోరుబావి వద్ద నిల్వ ఉండి అక్కడ దోమలు, ఈగలు చేరి పారిశుధ్యం లోపిస్తుంది. కాలువ పనులు పూర్తి చేసి మురుగు నీరు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేపట్టిన కార్మికులు

మక్కువ: మండల కేంద్రంలోని మక్కువలో శనివారం ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో పారిశుధ్య పనులు శనివారం చేపట్టారు. మండల కేంద్రంలోని అన్ని ప్రధాన వీధుల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికులు తొలగించారు. అలాగే కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి ట్రాక్టర్ల సహాయంతో డంపింగ్ చేయించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోవడంతో పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన తప్పనిసరి



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు రవికుమార్

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో విజృంభించే వ్యాధులపై గ్రామీణ ప్రజలు అవగాహన పెంచుకుని వాటిని సమర్థవంతగా అధిగమించాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. మండలంలోని బెజ్జి సచివాలయ పరిధిలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది పలువురు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మన్యం ప్రజలకు ప్రయాణ కష్టాలు

పార్వతీపురం రూరల్:

మావోయిస్టులు తమ సిద్ధాంతాలను కొనసాగించేందుకు ప్రతీ ఏటా వారోత్సవాలను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే ప్రభుత్వ అధికారులు మావోయిస్టుల వారోత్సవాలను అణిచి వేసేందుకు గిరిజన ప్రాంతాలకు ఉండే రవాణా సౌకర్యాలను నిలిపివేసి గిరిజనులకు ఇబ్బందులను కలిగించేలా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి బీరుపాడు, నారాయణపట్నం ప్రాంతాలకు పార్వతీపురం నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులను పోలీసు శాఖ ఆదేశాల మేరకు నిలుపుదల చేయడంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు చేసే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు వాహనాలపై ఆధారపడుతూ ప్రమాదకర స్థితిలో పరిమితికి మించి ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ములిగుడ, రేగిడి, గొరడ, పెంగవ, సాపయబెండిన్ని, రాయగడ జమ్ము, కొందుకుప్ప ఇలా దాదాపుగా 30 గిరిజన గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలాగే పాఠశాలలు ప్రారంభమై కళాశాలల్లో తరగతులు నిర్వహించడం విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు సైతం రాకపోకలు సాగించేందుకు ఇక్కట్లును ఎదుర్కొంటున్నారు. ప్రజా సంఘాల నాయకులు బస్సుల నిలుపుదలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు.



నారాయణపట్నం ప్రాంతానికి బస్సు సౌకర్యం లేక ఆటోలో ప్రమాదకర ప్రయాణం చేస్తున్న గిరిజనులు

ఈ విషయమై సాక్షి ఆర్టీసీ పార్వతీపురం డిపో మేనేజర్ కనకదుర్గ వద్ద ప్రస్తావించగా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలుపుదల చేసినట్టు తెలిపారు. వారి ఆదేశాల మేరకు సోమవారం నుంచి బీరుపాడు బస్సును పగటి పూట నడిపేందుకు కార్యాచరణ చేసినట్టు తెలిపారు.

ఇది సరికాదు..



వారోత్సవాల పేరిట ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులను నిలుపుదల చేసి ప్రజలను అసౌకర్యాలకు గురి చేయడం సరికాదు. ప్రభుత్వ పరమైన అధికారులు లేదా పోలీసు శాఖ ప్రజలకు అవసరమైతే రక్షణ చర్యలు చేపట్టాలే తప్ప ఈ విధంగా అసౌకర్యాలకు గురి చేయకూడదు. ఒక వేళ ఏదైనా ఉద్రిక్త పరిస్థితి ఉంటే వాటిని నివారించేందుకు చర్యలు చేపట్టాలే తప్ప ఇలాంటి ఆలోచనలతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేయకూడదు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రస్తుతం మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ప్రభుత్వ బస్సు సర్వీసులు అవసరం. గత్యంతరం లేక ప్రజలు ప్రైవేటు రవాణా వ్యవస్థపై ఆధారపడుతున్నారు. తక్షణమే బీరుపాడు, నారాయణపట్నం బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి.

– బీవీ రమణ, జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి

జూలై 9న దేశ వ్యాప్త సమ్మె

పార్వతీపురం: జూలై 9న తలపెట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను బీజేపీ ప్రభుత్వం కార్పొరేటర్లకు ప్రయోజనాలు చేకూర్చేలా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం జరిగిందన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగించే లేబర్ చట్టాలను రద్దు చేసే వరకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేట్ సంస్థల యజమానులకు రుణాలను రద్దు చేస్తూ కొత్త రుణాలు మంజూరు చేస్తున్నారన్నారు. పేద ప్రజలపై చిన్న మధ్య తరహా పరిశ్రమల యజమాన్యాలపై విద్యుత్ యూజర్ చార్జీస్, జీఎస్టీ విధించి పరిశ్రమలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారన్నారు. నష్టాల పేరుతో విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేసేలా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. అందుకు రాష్ట్రప్రభుత్వం వత్తాసు పలుకుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.మన్మధరావు, ఎన్‌వై.నాయుడు, వి.ఇందిర, బివి.రమణ, జివి.రమణ, ఆర్.రాము, వై.శాంతకుమారి, కె.సాంబమూర్తి, ఎం.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు జి.కోటేశ్వరరావు

కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



ఆందోళన చేస్తున్న గిరిజనులు

పాచిపెంట: జీవో 3ని పునరుద్ధరించి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చి గిరిజనులకు న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సంఘ నాయకులు సీహెచ్ జగన్నాధం, మంచాల గంగరాజు ఆధ్వర్యంలో మండలంలోని పెదచీపురువలస – కోష్ట వలస జంక్షన్ వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ జీవో 3 ప్రకారం నూరు శాతం గిరిజనులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఏజెన్సీలో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి పదెకరాల చొప్పున పట్టాలివ్వాల్సి ఉన్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. గిరిజనులు, యువకులు పాల్గొన్నారు.

తల్లికి మంగళం.. తండ్రికి సంబరం

మక్కువ: తొలి ఏడాది తల్లికి వందనం నగదు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా కూటమి ప్రభుత్వం పంగనామం పెట్టింది. ఈ ఏడాది తల్లికి వందనం నగదు కూటమి ప్రభుత్వం తల్లుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేస్తున్నప్పటికీ, మక్కువ మండలం శంబర గ్రామానికి చెందిన ఓ విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాకు నగదు జమ కాకుండా, తండ్రి ఖాతాకు జమ కావడంతో ఆ తల్లి అవాక్కయింది. మక్కువ మండలం శంబర గ్రామానికి చెందిన 3వ తరగతి విద్యార్థి కోమనపల్లి తేజేశ్వరరావు శంబర పాఠశాలలో చదువుతున్నాడు. ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం నగదు విద్యార్థి తేజేశ్వరరావు తల్లి గంగ బ్యాంక్ ఖాతాకు జమ కాకుండా, ఐదేళ్లుగా భార్యా పిల్లలకు దూరంగా ఉంటున్న తండ్రి కోమనపల్లి సత్యం బ్యాంక్ ఖాతాకు జమ కావడంతో తల్లి గంగ ఆవేదన చెందుతుంది. పలు కారణాల వల్ల భర్త దూరంగా ఉండటంతో, ఇద్దరు పిల్లలతో గంగ తన కన్నవారి గ్రామం శంబర గ్రామంలో తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. తల్లికి వందనం నగదు జమ వుతుందని, ఎంతో సంబరపడ్డానని, నా ఖాతాకు నగదు జమ కాకుండా, భర్త సత్యం ఖాతాకు నగదు జమ కావడంతో తల్లికి మంగళం, తండ్రికి సంబరం అన్నట్టు ఉందని ఆమె వాపోయారు.



ఆవేదన చెందుతున్న విద్యార్థి తల్లి

అమ్మ ఒడి ఇచ్చారు... తల్లికి వందనం మరిచారు...

పార్వతీపురం టౌన్: గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి ఇచ్చారని, తల్లికి వందనం మరిచారని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మ ఒడి పేరుతో కార్మికులందరికీ నగదు జమ చేసిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో మోసం చేశారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం అందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాగవంశం శంకరరావు, చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ, పి.నరేష్, నాగవంశం మల్లేసు, బి.సంతోషికుమారి, లీల, చిరంజీవి, ఈశ్వరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీరునాయుడుకు వినతిపత్రం అందజేశారు.

మత్తు జోలికి పోవద్దు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న కృష్ణమోహన్

పార్వతీపురం రూరల్: మాదక ద్రవ్యాల వాడకంతో జీవితాలను నాశనం చేసుకోవద్దని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా ఈగల్ సెల్ సభ్యుడు కృష్ణమోహన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోలు పలు కూడళ్లలో ప్రజలు, ఆటో డ్రైవర్లకు, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ వర్కర్లకు మాదక ద్రవ్యాల నివారణపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిస కావొద్దని హితవు పలికారు. మద్యం, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం వంటి సమాచారం తెలిస్తే టోల్‌ఫ్రీ నంబరు 1972కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీలో విఫలం..

పాలకొండ: రైతులకు అవసరమయ్యే విత్తనాలు పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు అన్నారు. డివిజన్ కేంద్రంలో శనివారం జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ప్రభుత్వం కేవలం 30 శాతం మాత్రమే విత్తనాలు అందించిందని తెలిపారు. జిల్లాకు సుమారుగా ఆరు టన్నుల విత్తనాలు అవసరం ఉండగా ఈ ఊడాది రెండు టన్నులు మాత్రమే అందించారని తెలిపారు. ఇందులోను రైతులకు అవసమయ్యే సంపత్ రకం పూర్తిగా అందుబాటులో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు అధిక ధరలకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఈ రకం విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు. మరోవైపు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు కిమిడి రామ్మూర్తినాయుడు, బచ్చల పారినాయుడు, మజ్జి సన్యాసినాయుడు, గౌరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఎండీయూ వాహనాలు కొనసాగించాలి

ప్రజలకు రేషన్ కష్టాలు తీర్చే ఎండీయూ వాహనాలను కొనసాగించాలని ఆదివాసీ గిరిజన సంఘం కురుపాం మండల అధ్యక్షుడు ఆరిక గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జి.శివడ పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ తీసుకునేందుకు డీలర్ షాపుల వద్దకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా గిరిజనులు కొండ దిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వారు ఎంతో శ్రమపడి కిందికి వచ్చిన తర్వాత రేషన్ షాపుల వద్ద పెద్ద క్యూలైన్ ఉంటోందని, దీంతో గంటల తరబడి నిల్చోవాల్సిన దుస్థితి ఉంటోందన్నారు. మళ్లీ రేషన్ సరుకుల బరువు నెత్తిన పెట్టుకుని కొండ ఎక్కాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, కనీసం గిరిజన ప్రాంతాల్లో అయినా వాహనాలు నడపాలని కోరారు.



– గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

ఆర్‌జీఎల్ విత్తనాలేవీ..!

పార్వతీపురం: ఖరీఫ్‌కు అవసరమైన ఆర్‌జీఎల్ వరి విత్తనాలను ఆర్ఎస్‌కే కేంద్రాల ద్వారా సరఫరా చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఆర్‌జీఎల్ విత్తనాలు సరఫరా చేయకపోవడంతో రైతులు పార్వతీపురం, వీరఘట్టం, పాలకొండ తదితర పట్టణాలలోని ప్రైవేటు వ్యాపారుల వద్ద రూ.1200లు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. వ్యాపారులుకు అధిక ధరను చెల్లించడంతో పాటు రవాణాకు అదనంగా చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఎంటీయూ 1064, సాంబమసూరి, ఎంటీయూ 1121, ఎంటీయూ 1061 తదితర విత్తనాలున్నప్పటికీ రైతు సేవా కేంద్రాలలో ఆర్‌జీఎల్ 2537 విత్తనాలు లభించకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ తల్లికి వందనం ఇవ్వాలి

పార్వతీపురం: తల్లికి వందనం పథకం అందరికీ వర్తింపజేయాలని, నిబంధనల పేరుతో అనర్హులుగా ప్రకటించడం సరికాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా అధికారంలోకి వస్తే షరతులు లేకుండా ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి రూ.15వేలు చొప్పున్న మాట ఇచ్చి, ఇప్పుడు ఆ మొత్తంలో కోత పెట్టి రూ.13వేలు ఇవ్వడం దిగజారుడుతనం అన్నారు. 300 యూనిట్లు విద్యుత్ వినియోగించిన వారికి, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్న కుటుంబంలో ఉన్న పిల్లలకు ఈ పథకాన్ని నిలిపివేయడం సరికాదన్నారు. ఒకే కుటుంబంలో పాఠశాల, డిగ్రీ చదివే విద్యార్థులు ఉంటే ఒకరికి మాత్రమే ఏదైనా పథకం వర్తిస్తుందని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నాయని, ఆచరణలో గడప దాటడం లేదని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని అర్హులకు సంక్షేమ పథకాలను అందించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రేపు

- హాజరు కానున్న కలెక్టర్

సాలూరు: మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 10 గంటల నుంచి పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నాయి. జిల్లా అధికారులందరూ పాల్గొనే ఈ పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. సాలూరు ఎంపీడీవో కార్యాలయం నుంచి సాలూరు మున్సిపల్ కార్యాలయానికి పీజీఆర్ఎస్ వేదికను మార్చినట్టు ప్రజలు గమనించాలని కోరారు.

రక్తదానంతో ప్రాణం పోయండి

పార్వతీపురం టౌన్: రక్తదానంతో ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డా.మంచిపల్లి శ్రీరాములు పిలుపునిచ్చారు. జిల్లా ఆసుపత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడంలో అపోహలు వద్దని, రక్తదానం చేయడానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతో మందికి స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్న రక్తదాతలకు ప్రపంచ రక్తదాత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు బోటు రామకృష్ణ, జీవితకాల సభ్యులు కొండపల్లి వెంకటరమణ, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ యమ్మల జనార్దనరావు పాల్గొన్నారు.



జిల్లా ఆసుపత్రిలో రక్తదానం చేస్తున్న దాతలు

తల్లికి వందనంపై నిరసన



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తల్లికి వందనం మున్సిపల్ కార్మికుల పిల్లలకు వర్తింపజేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సభ్యులు డిమాండ్ చేశారు. తల్లికి వందనం మున్సిపల్ కార్మికుల పిల్లలకు ఇవ్వకపోవడంపై సాలూరులో శనివారం ప్రభుత్వ తీరును నిరసించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ మున్సిపాలిటీలో అన్ని వర్గాల కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌వై నాయుడు, రాముడు, శంకర్, రవి, శ్రీను, బాలరాజు, స్వప్న తదితరులు పాల్గొన్నారు. – సాలూరు

పంపిణీకి మొక్కలు సిద్ధం

సీతానగరం: పంపిణీకి వివిధ రకాల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని వన సంరక్షక్ చంటి తెలిపారు. అంటిపేట పంచాయతీ వెంకటాపురంలో అటవీ శాఖ ఆర్థిక సాయంతో ఉత్పత్తి చేస్తున్న మొక్కలను పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. రైతులకు నీలగిరి, సరుగుడు, టేకు, జామ, ఉసిరి, సీతాఫలం మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలు ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మొక్కలు కావాల్సిన రైతులు ఆధార్, భూమికి సంబంధించిన జెరాక్స్ కాపీలతో సంప్రదించాలని కోరారు. ఉచితంగా మొక్కలు కావాల్సిన వారు 80747 56530 నంబరుకు సంప్రదించాలని సూచించారు.



టేకు మొక్కలు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : డీఎంహెచ్‌వో

పార్వతీపురం రూరల్:

సులవైన ఆసనాలతో యోగా చేసి ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.భాస్కరరావు అన్నారు. మండలంలోని చినబొండపల్లి గ్రామంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా డెమో ట్రైనింగ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలో పంచాయతీ సర్పంచ్ జి.శంకరరావు నేతృత్వంలో చినబొండపల్లిలో ఉన్న పలు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి యోగాపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నేతృత్వంలో సులవైన ఆసనాలు వేసి యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ దిన చర్యలో యోగా ఉండేలా కార్యాచరణ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా.జగన్‌మోహన్‌రావు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చినబొండపల్లిలో యోగా ఆసనాలు వేస్తున్న డీఎంహెచ్‌వో డా.భాస్కరరావు

సీతానగరంలో..

సీతానగరం: ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యల్లో భాగంగా అలవాటు చేసు కోవాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండ పరిషత్ కార్యాలయం, గాదెలవలస ఉన్నత పాఠశాల, సీతానగరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో కోర్సు డైరక్టర్లు ఆధ్వర్యంలో జరిగిన యోగా శిక్షణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. యోగా శిక్షకుడు ఈదుబిల్లి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మక్కువలో...

మక్కువ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సూర్యనారాయణ అన్నారు. స్థానిక సచివాలయ ఆవరణలో యోగా ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉదయం పూట యోగా సాధన చేస్తే పరిపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. యోగా పట్ల అవగాహన కలిగి ఇతరులకు వివరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యోగాతో ఉత్తేజం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్య నిర్వహణ అధికారి బెహరా శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ రౌతు.సతీష్ కుమార్, అంగన్‌వాడీ, వైద్య, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.